నిమిషం ఆలస్యమైనా నో ఇన్‌టర్

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం
- కొవ్వూరు డివిజన్‌లో 10,387 మంది విద్యార్థులు
- ఐదు చోట్ల 15 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

కొవ్వూరు: బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఇప్పటికే పరీక్ష పత్రాలు కొవ్వూరు, నిడదవోలు, నల్లజర్ల, చాగల్లు, గోపాలపురం, తాళ్లపూడి పోలీసు స్టేషన్లకు చేరుకున్నాయి. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 15 పరీక్ష కేంద్రాల్లో 10,397 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వారిలో మొదటి సంవత్సరం 5,367 మంది, ద్వితీయ సంవత్సరం 5,020 మంది విద్యార్థులు ఉన్నారు. నిడదవోలు పట్టణంలో



కొవ్వూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలకు ఏర్పాటు చేసిన టేబుళ్లు

ఆరు, కొవ్వూరు, నల్లజర్లలలో మూడేసి, గోపాలపురంలో రెండు, తాళ్లపూడిలో ఒక పరీక్ష కేంద్రం చొప్పున ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయి. ఈనెల 15న ప్రారంభమయ్యే పరీక్షలు ఏప్రిల్ 4 వరకూ కొనసాగుతాయి. వచ్చే నెల 15 నుంచి 25 వరకు, ఏప్రిల్ 30 నుంచి మే10 వరకూ రెండు పూటలా రెగ్యులర్, వృతి విద్య విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరుగుతాయి. ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యుత్తు లైట్లతో పాటు తాగునీరు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, స్మార్ట్‌వాచ్‌లు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు.అన్ని పరీక్ష కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌గా అధికారులు ప్రకటించారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

ఈనెల 15న ఫస్టియర్ సెకండ్ లాంగ్వేజ్, 16న సెకండియర్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు నిర్వహిస్తారు.17న ఫస్టియర్, 18న సెకండియర్ ఇంగ్లిషు పరీక్ష , 20న ఫస్టియర్ లెక్కలు, బోటనీ, సివిక్స్, 21న సెకండియర్ లెక్కలు, బోటనీ, సివిక్స్ పరీక్షలు నిర్వహిస్తారు. 23న ఫస్టియర్ లెక్కలు-1బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలు, 24న సెకండియర్ లెక్కలు, జువాలజీ, హిస్టరీ, 25న ఫస్టియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్, 27న సెకండియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు జరుగుతాయి. 28న ఫస్టియర్ కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్, 29న సెకండియర్ కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పరీక్షలు నిర్వహిస్తారు. 31న ఫస్టియర్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్ -1, బ్రిడ్జి కోర్సు మేథమెటిక్స్-1 (బైపీసీ స్టూడెంట్స్‌కు) ఏప్రిల్ 1న సెకండియర్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్-2, బ్రిడ్జి కోర్సు మేథమెటిక్స్-2 (బైపీసీ స్టూడెంట్స్‌కు) పరీక్షలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 3న మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1, జియోగ్రఫీ, 4న సెకండియర్ మోడ్రన్ లాంగ్వేజ్-2, జియోగ్రఫీ-2 పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 15 నుంచి 25 వరకూ, ఏప్రిల్ 30 నుంచి మే 10 వరకు జనరల్, వృత్తివిద్య కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రెండు పూటలా ఈ పరీక్షలు నిర్వహిస్తారు.

డివిజన్‌లో పరీక్ష కేంద్రాల వివరాలు

ప్రదేశం	పరీక్ష కేంద్రాల సంఖ్య	ఫస్ట్ ఇయర్ విద్యార్థులు	సెకండ్ ఇయర్ విద్యార్థులు	మొత్తం విద్యార్థులు
నిడదవోలు	6	2,461	2,235	4,696
కొవ్వూరు	3	781	768	1,549
నల్లజర్ల	3	1,173	1,197	2,370
గోపాలపురం	2	703	570	1,273
తాళ్లపూడి	1	249	250	499

అమలులో 144 సెక్షన్

విద్యార్థి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించం. అరగంట ముందుగా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తాం. విద్యార్థులకు ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే కంట్రోల్ రూమ్ 08812-230197 నంబర్‌లో సంప్రదించాలి.అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్ష కేంద్రం ప్రాంగణంలో ప్రాథమిక వైద్య శిబిరం, తాగునీరు వంటి సదుపాయాలు కల్పిస్తున్నాం. పరీక్ష కేంద్రాల పరిధిలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని ఆదేశించాం. ప్రతి పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు అవసరమైనంత మంది ఇన్విజిలేటర్లను, పర్యవేక్షణకు అదనంగా 15 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, ప్రత్యేక స్క్వాడ్‌లను నియమించాం.



– కె.చంద్రశేఖర్, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి, ఇంటర్మీడియెట్ బోర్డు, ఏలూరు

ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు



ఇంటర్మీడియెట్ పరీక్షల నేపథ్యంలో అన్ని రూట్లలో తిరిగే బస్సుల సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు చేయి ఎత్తితే బస్సును ఆపి ఎక్కించుకోవాలని సూచించాం. ఉదయం, మధ్యాహ్నం పూట బస్సు డిపోల్లోను, ప్రధాన కూడళ్లలో పర్యవేక్షణ చేస్తాం. కుమారదేవంలోని గురుకుల సాంఘిక సంక్షేమ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక ఉచిత బస్సు సర్వీసు ఏర్పాటు చేశాం. వారిని పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లి పరీక్ష అనంతరం మళ్లీ కళాశాల వద్ద విడిచి పెడతాం.

– వైవీవీఏ కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్, కొవ్వూరు

క్లుప్తంగా

బాలిక వైద్యానికి 'మానవత' సాయం

నల్లజర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న నల్లజర్లకు చెందిన దెయ్యాల అచ్యుత అనే బాలిక వైద్యం నిమిత్తం మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ మంగళవారం రూ.4 వేల ఆర్థిక సాయం చేసింది. మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు గుళ్ళపూడి వెంకటరత్నం ఈ మొత్తాన్ని ఆ బాలికకు అందజేశారు.ఆయనతో పాటు ఉపాధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్, కోశాధికారి గుండు త్రినాథరావు, గ్రామపెద్ద పల్లి సుబ్బారావు ఉన్నారు.

నదిలో మునిగిపోతున్న వృద్ధురాలిని రక్షించిన స్థానికులు



చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వృద్ధురాలు

కొవ్వూరు: గోదావరి నదిలో మునిగిపోతున్న గుర్తుతెలియని వృద్ధురాలిని మంగళవారం ఉదయం కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద స్థానికులు రక్షించారు.అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను 108 అంబులెన్స్‌లో తొలుత కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యసేవల నిమిత్తం అక్కడి నుంచి ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అపస్మారక స్థితిలో ఉండడంతో ఆ వృద్ధురాలి వివరాలు తెలియలేదని పట్టణ పోలీసులు తెలిపారు. ఆమె వయస్సు అరవై ఏళ్లకు పైబడి ఉండవచ్చని తెలిపారు.

మృతుని కుటుంబానికి బీమా సాయం



విజయ్ కుటుంబ సభ్యులకు సాయాన్ని అందిస్తున్న నేతలు, సచివాలయ సిబ్బంది

నిడదవోలు రూరల్: పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబానికి వైఎస్సార్ బీమా అండగా నిలుస్తుందని వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన కొక్కిరపాటి విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు రూ.10 వేల తక్షణ బీమా సాయాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దేశాబత్తుల నాగు, వడలి అంబేడ్కర్, వెల్ఫేర్ అసిస్టెంట్ దొంకా విజయ్, వలంటీర్ మల్లిపూడి సుమ తదితరులు పాల్గొన్నారు.

తీపర్రులో దంత వైద్య శిబిరం



దంత వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెరవలి: పేదలు వైద్య శిబిరాల సేవలను సద్వినియోగం చేసుకున్నప్పుడే వాటిని ఏర్పాటు చేసే స్వచ్ఛంద సంస్థల లక్ష్యం నెరవేరుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుందుల భూపతిరావు అన్నారు. లయన్స్ క్లబ్ పెరవలి శాఖ ఆధ్వర్యంలో మండలంలోని తీపర్రు గ్రామంలో మంగళవారం దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కుందుల భూపతిరావు ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో భీమవరానికి చెందిన విష్ణు దంత వైద్య కళాశాల వైద్యులు 110 మందికి దంత పరీక్షలు చేశారు. వారిలో 40 మంది రోగుల దంతాలు క్లీనింగ్ చేశారు. తదుపరి చికిత్స కోసం మరో 20 మందిని సిఫార్సు చేసినట్టు డెంటిస్టు ఆదిత్య తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ రామలింగేశ్వరరావు, జోన్ చైర్‌పర్సన్ వంక రాజకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పెరవలి శాఖ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, సలాది ఉదయ భాస్కరరావు, రంగా వెంకటేశ్వరరావు, అడపా బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు: కుమారదేవం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ పి.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినులతో పాటు, జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీలో కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 23వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఐదో తరగతికి, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకూ ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో ఇంగ్లిషు విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ఉచిత భోజనం, వసతి, పుస్తకాలు, యూనిఫాం వంటివి విద్యార్థులకు ఉచితంగా అందిస్తామని సుజాత తెలిపారు. ఎనిమిదో తరగతి నుంచి సీబీఎస్‌ఈ విద్యాబోధన అందిస్తున్నామన్నారు.

ఉపాధి కోల్పోయిన కార్మికుడికి ఆర్థిక సాయం

దేవరపల్లి: విద్యుదాఘాతానికి గురై వైద్యం చేయించుకుని ఉపాధి కోల్పోయిన స్థానిక సెంట్రింగ్ కార్మికుడు శ్రీనుకు దేవరపల్లికి చెందిన టి.ముకుంద సేవాసంస్థ సభ్యులు మంగళవారం ఆర్థిక సాయం చేశారు. ఆ సంస్థ అధ్యక్షుడు తంగెళ్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సభ్యులు శ్రీనుకు రూ.5 వేల నగదు, 25 కిలోల బియ్యం అందజేశారు. ఆపదలో ఉన్న వారికి ప్రతి నెలా 13వ తేదీన సంస్థ ద్వారా రూ.5 వేల నగదు, 25 కిలోల బియ్యం అందజేస్తున్నట్టు సుబ్రహ్మణ్యం తెలిపారు. గత ఐదేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

హాస్టళ్లలో నూరు శాతం ఫలితాల సాధనకు కృషి

- డీఎస్‌డబ్ల్యూ ఈవో జనార్దనరావు
- కొవ్వూరు, తాళ్లపూడి, దేవరపల్లిలో హాస్టళ్ల తనిఖీ



ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులతో మాట్లాడుతున్న జనార్దనరావు

కొవ్వూరు: సాంఘిక సంక్షేమ వసతి గృహాల పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్ జి.జనార్దనరావు అన్నారు. పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.వసతి గృహంలోని విద్యార్థులతో మాట్లాడి వసతి, అందిస్తున్న ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 19 వసతి గృహాల్లో 166 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారన్నారు. ఒక్కో వసతి గృహానికి ఇంగ్లిషు, లెక్కలు, హిందీ, సైన్స్ బోధించేందుకు 52 మంది ట్యూటర్లను నియమించామన్నారు. జనవరి నెల వరకూ హాస్టళ్ల డైట్ చార్జీలను చెల్లించామన్నారు. మార్చి నెలాఖరు వరకు డైట్ చార్జీలతో పాటు కాస్మెటిక్ చార్జీలు మంజూరు చేశామని జనార్దనరావు తెలిపారు. మంగళవారం తాను తాళ్లపూడి, దేవరపల్లి, కొవ్వూరు వసతి గృహాలను పరిశీలించినట్టు తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు అవసరమైన ట్యూటర్లను నియమించేందుకు తన వంతు తోడ్పాటు అందిస్తానని రిటైర్డు హాస్టల్ వార్డెన్ పెనుమాక జయరాజు ఆయనకు తెలిపారు. ఏఎస్‌డబ్ల్యూ ఎస్.మేరీమాత, వార్డెన్ ముప్పిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు

నిడదవోలు రూరల్: ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకూ నిర్వహించే పదో తరగతి పరీక్షలకు మండలంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు నిడదవోలు ఎంఈఓ కిషోర్ చెప్పారు. మండలంలోని పురుషోత్తపల్లి జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కిషోర్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు తాగునీరు, నిరంతర విద్యుత్, రవాణా సదుపాయం కల్పిస్తామని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తామని చెప్పారు. హెచ్ఎం డీఎస్‌వీఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిడదవోలులో తాటాకిల్లు దగ్ధం



నిడదవోలు సుబ్బరాజు పేటలో కాలిపోతున్న తాటాకిల్లు

నిడదవోలు రూరల్: నిడదవోలు పట్టణంలోని సుబ్బరాజుపేటలో కోడి బుజ్జి అనే వ్యక్తికి చెందిన రెండు పోర్షన్ల తాటాకిల్లు మంగళవారం రాత్రి దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఈ అగ్ని ప్రమాదానికి కారణమని ఫైర్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. రెండు పోర్షన్ల ఇంట్లో కోడి గంగరాజు, నవీన్‌లకు చెందిన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ ప్రమాదంలో ఇంటితో పాటు గృహోపకరణాలు, సుమారు రూ.50 వేల నగదు కాలి బూడిదయ్యాయి. ఆస్తినష్టం రూ.4.50 లక్షల మేర ఉంటుందంటూ బాధితులు ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

బైలాకు లోబడి సొసైటీలను నడపాలి

- డీసీవో నాగభూషణం
- సొసైటీల సీఈఓలకు పశివేదలలో ఒక రోజు శిక్షణ



సొసైటీల సీఈఓల శిక్షణలో మాట్లాడుతున్న డీసీవో నాగభూషణం

కొవ్వూరు: చట్ట పరిధిలో బై లాకు లోబడి సొసైటీలను నిర్వహించాలని జిల్లా సహకార అధికారి (డీసీవో) మిరియాల నాగభూషణం సూచించారు. రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సీఈవోలకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. మండలంలోని పశివేదల ఎల్‌ఏసీఎస్‌లో మంగళవారం నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో నాగభూషణం మాట్లాడారు. సహకార సంఘాల సభ్యుల శ్రేయస్సు, సభ్యుల అవరాలు లక్ష్యంగా సొసైటీల సీఈవోలు పనిచేయాలని సూచించారు. ఈ నెలలో విధిగా సొసైటీల మహాజన సభ నిర్వహించాలని ఆదేశించారు. రామదాసు సహకార శిక్షణ కేంద్రం అధ్యాపకుడు ఆదిమూలపు వెంకటేశ్వరరావు తన ప్రసంగంలో సహకార సూత్రాలు, సొసైటీల్లో సీఈవోల పాత్ర గురించి తెలిపారు. సహకార చట్టాల్లో వచ్చిన సవరణల గురించి ఏసీటీసీ ఫ్యాకల్టీ ఎ.శ్రీనివాసరావు వివరించారు. కొవ్వూరు సహకార డివిజనల్ అధికారి కె.సుబ్బారావు, పలు సొసైటీల సీఈవోలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అభినందనలు

ఉండ్రాజవరం: మండల స్థాయిలో ఇటీవల నిర్వహించిన గన్నమని శేషగిరిరావు స్మారక ప్రతిభా పాటవ పరీక్షలో సూర్యారావుపాలెం నెంబర్-2 ప్రాథమిక పాఠశాల విజేతగా నిలిచింది. అందుకు విశేషంగా కృషి చేసిన ఈ పాఠశాల ఉపాధ్యాయులు శశిధర్ కుమార్, విజయలక్ష్మిని, విద్యార్థులను మంగళవారం పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ ఎస్.శ్రావణి, గ్రామ పెద్దలు, పలువురు అభినందించారు. హెచ్ఎం ఎస్.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత గల పిల్లలను గుర్తించండి

పెరవలి: గ్రామాల్లో రక్తహీనత గల బాలలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్.రమేష్ సూచించారు. వివిధ శాఖల అధికారులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ 5-15 సంవత్సరాల మధ్య వయసు వారిలో రక్తహీనత ఎక్కువగా ఉంటోందన్నారు. పాఠశాలల ఉపాధ్యాయలతో కలసి అలాంటి వారిని గుర్తించాలని ఐకేపీ, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది సలహా ఇచ్చారు. అలాగే గర్భిణులు సమయానికి పౌష్టికాహారం తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ డి హైమావతి, ఈఓపీఆర్‌డీ మూర్తి, సీడీపీవో శ్రీలక్ష్మి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి హుండీల ఆదాయం రూ.50 వేలు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలోని హుండీలను లెక్కించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ప్రతి నెలా హుండీలను లెక్కిస్తున్నట్టు చెప్పారు. ఈ నెలలో స్వామి వారికి హుండీల ద్వారా రూ.50 వేల ఆదాయం వచ్చినట్టు ఆయన తెలిపారు. ప్రతి నెలా హుండీల ద్వారా రూ.50 నుంచి రూ. 60 వేలు ఆదాయం వస్తున్నట్టు ఆయన చెప్పారు.

నులిమేసే లక్ష్యంతో..

- 19 ఏళ్ల లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు
- మూడు నియోజకవర్గాల్లో విస్తృతంగా పంపిణీ
- సేవలు అందించిన వైద్య,ఆరోగ్య శాఖ, ఆశ కార్యకర్తలు

కొవ్వూరు: పిల్లల్లో రక్తహీనతకు, అలసట నీరసానికి కారణమవుతున్న నులి పురుగులను నులిమేసేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. నులి పురుగల నివారణ కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య శాఖ మంగళవారం కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లో నిర్వహించింది. ఇందులో భాగంగా కొవ్వూరు మండలంలోని కుమారదేవం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల బాలికలతో దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ పీహెచ్‌పీ పరిధిలో 19 ఏళ్ల లోపు వారు 6,077 మంది ఉండగా, వారిలో తొలి రోజు 97 శాతం మందికి మాత్రలు పంపిణీ చేశామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. మంగళవారం సాయంత్రానికి 5,912 మందితో మాత్రలు మింగించినట్టు తెలిపారు. అలాగే కొవ్వూరులో పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ఉపాధ్యాయుల సాయంతో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. పట్టణంలో మొత్తం 10,631 మంది ఉంటే తొలి రోజు 10,409 మందితో ఈ మాత్రలు మింగించారు. మిగిలిన 222 మందికీ ఈనెల 18న మళ్లీ అందజేస్తామని ఆమె తెలిపారు.



సమిశ్రగూడెంలో విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి అమరేంద్ర

చాగల్లు: చాగల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి తనూజ ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులతో ఆల్బెండ్‌జోల్ మాత్రలు మింగించారు. వైద్య సిబ్బంది, పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సేవలు అందించారు.

తాళ్లపూడి: మండలంలోని వివిధ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంఈవో కె.వివేకానంద, తాళ్లపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి రమణ నాయక్ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నిడదవోలు రూరల్: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి ఆల్బెండజోల్ మాత్రలు దోహదపడతాయని సమిశ్రగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.అమరేంద్ర చౌదరి అన్నారు.మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీల్లోని విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ పరిధిలో 2400 మందికి మాత్రలు వేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో ఎ.రాజమోహన్, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరవలి పీహెచ్‌సీ పరిధిలో 92 శాతం

పెరవలి: స్థానిక ఉన్నత పాఠశాల్లో ఎంఈఓ డి.హైమావతి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా పెరవలి పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ తమ పీహెచ్‌సీ పరిధిలో 7,142 మంది పిల్లలు ఉండగా, వారిలో 6,627 మందికి మాత్రలు వేసి 92 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు. కానూరు పీహెచ్‌సి పరిధిలో 8,876 మంది పిల్లలకు 8,416 మందికి మాత్రలు వేశామని ఆ పీహెచ్‌సి డాక్టర్ పి.తేజశ్రీ తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీడీవో ఎస్.రమేష్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



ఉండ్రాజవరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారితో మాత్ర మింగిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వరలక్ష్మి

ఉండ్రాజవరం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలను నమిలి మింగించారు. కొవ్వూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.వరలక్ష్మి, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసులు ఉండ్రాజవరం ఎంపీపీ పాఠశాల-1, 132, 149 నంబర్ల అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. బాల బాలికలకు ఆమె మాత్రలు వేశారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్, సీహెచ్‌ఓ సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ కె.సుభాషిణి, ఆరోగ్య, అంగన్ వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లజర్ల: స్థానిక ఎస్ఆర్‌కే కళాశాలలో ఆ కళాశాల చైర్మన్ నారాయణ ప్రసాద్ విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు మాట్లాడుతూ మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 14,258 మంది విద్యార్థులకు ఈ మాత్రలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సీహెచ్ కిరణ్‌కుమార్, కె.సుబ్రహ్మణ్యం, ఎస్.సత్యనారాయణ, బి.వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

గౌరీపట్నం, దేవరపల్లిలలో..

దేవరపల్లి: గౌరీపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి టి.సూర్యకళ ఆధ్వర్యంలో గౌరీపట్నం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. సీహెచ్‌ఓ శ్రీకృష్ణుడు, హెచ్ఎం కె.ఫణిశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే దేవరపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు.